



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

శనివారం

31-01-2026






## హిప్నటైజ్ చేసి.. బంగారం చోరీ!

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు చెందిన ఒలింపిక్ క్రీడాకారుడు సురాజ్ పన్వర్ తల్లి పూనమ్‌ను హిప్నటైజ్ చేసి, రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఆమె బుధవారం ఉదయం తన ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. కొంత దూరం తర్వాత మరొకరు వారికి తోడయ్యాడు. తనకు క్షుద్ర శక్తులపై పట్టు ఉందని, ఆమెను ఓ చెట్టు కిందకు తీసుకెళ్లారు. కొన్ని మంత్రాలను పఠించి, దుండగులిద్దరూ ఆమె పర్సులోని రూ.1,100 నగదు, ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పూనమ్ పోలీసులను ఆశ్రయించారు. చెప్పినట్టు చేయకపోతే ఇంటికి నిప్పంటిస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పులు.. రూ.6 లక్షలు దోపిడీ

హైదరాబాద్ లోని కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో ఈరోజు ఉదయం కాల్పులు కలకలం సృష్టించాయి. ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం సమీపంలో దుండగులు కాల్పులకు తెగబడి, ఓ వ్యక్తి నుంచి రూ.6 లక్షల నగదును దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే... రషీద్ అనే వ్యక్తి ఉదయం 7 గంటల సమయంలో ఏటీఎంలో డబ్బు డిపాజిట్ చేసేందుకు వచ్చాడు. అప్పటికే అతడిని వెంబడిస్తున్న దుండగులు, ఏటీఎం వద్ద కాల్పులు జరిపారు. ఈ ఘటనలో రషీద్ కాలికి బుల్లెట్ గాయం కాగా, అతని వద్ద ఉన్న రూ.6 లక్షల నగదును లాక్కొని పరారయ్యారు. సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన రషీద్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నగర నడిబొడ్డున ఉదయాన్నే ఈ ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపింది.





## ఎన్నికల బరిలో గాల్వాన్ హీరో కల్నల్ సంతోష్ బాబు మాతృమూర్తి

సూర్యాపేటకు చెందిన బిక్కుమల్ల సంతోష్ బాబుకు చిన్నతనం నుంచే దేశభక్తి మెండు. తండ్రి కోరిక నెరవేర్చడం కోసం ఆర్మీలో చేరాడు. అనతి కాలంలో సంతోష్ ఉన్నత శిఖరాలను అధిరోహించాడు. భారత్-చైనా సరిహద్దుల్లో 2020 జూన్ లో ఘర్షణలు జరిగాయి. గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన భీకర ఘర్షణలో దేశ రక్షణ కోసం కల్నల్ సంతోష్ బాబు తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి వీరమరణం పొందారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సంతోష్ బాబు భార్య సంతోషికి గ్రూప్ 1 ఉద్యోగం డిప్యూటీ కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చింది. ఆయన ధైర్యసాహసాలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2021లో దేశంలోనే రెండో అత్యున్నత సైనిక పురస్కారమైన మహావీర్ చక్ర'తో సంతోష్ బాబును గౌరవించింది. ఇపుడు ఆ యుద్ధ వీరుడు కల్నల్ బికుమళ్ళ సంతోష్ బాబు కుటుంబం ప్రజా క్షేత్రంలోకి అడుగుపెట్టింది. కుమారుడిని దేశానికి అంకితం చేసిన మాతృమూర్తిగా సంతోష్ బాబు తల్లి మంజుల మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగింది.

## రైలు పట్టాలపై కుటుంబం ఆత్మహత్య..

### ఘట్ కేసర్‌లో ఘోరం

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఘట్ కేసర్ మండల కేంద్రంలో ఈరోజు విషాదం చోటుచేసుకుంది. ఒకే కుంటుంబానికి చెందిన ముగ్గురు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. చర్లపల్లి— ఘట్ కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పరిశీలించి పోస్ట్ మార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతులను బోడుప్పల్ కు చెందిన సురేందర్ రెడ్డి, విజయ, చేతన రెడ్డిగా గుర్తించినట్లు తెలిపారు.

# అల్కరాజ్ X జొకోవిచ్

సుమారు మూడు వారాలుగా సాగుతున్న ఆస్ట్రేలియా ఓపెన్‌లో శుక్రవారం సంచలనాలు నమోదయ్యాయి. నలుగురు అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ల మధ్య అత్యంత రసవత్తరంగా సాగిన సెమీస్ మ్యాచ్‌లు అభిమానులను మునివేళ్లపై నిలబెట్టాయి. దాదాపు పదిగంటల పాటు (రెండు మ్యాచ్‌లు కలిపి) సాగిన పురుషుల సింగిల్స్ సెమీస్ పోరులో టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్, సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ టైటిల్ పోరుకు అర్హత సాధించారు. శుక్రవారం రాడ్ లీవర్ ఎరీనా వేదికగా జరిగిన మొదటి సెమీస్‌లో అల్కరాజ్.. 6-4, 7-6 (7/5), 6-7 (3/7), 6-7 (4/7), 7-5తో మూడో సీడ్ జర్మనీ ఆటగాడు అలగ్జాండర్ జ్వెరెవ్‌పై పోరాడి గెలిచాడు. ఆస్ట్రేలియా ఓపెన్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా సాగిన సెమీఫైనల్ (5 గంటల 27 నిమిషాలు)గా రికార్డులకెక్కిన మ్యాచ్‌లో 22 ఏండ్ల అల్కరాజ్.. అద్భుత పోరాటపటిమతో తన కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. తద్వారా కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకోవాలన్న తన లక్ష్యానికి మరో అడుగు దూరంలో నిలిచాడు. ఇక రెండో సెమీస్‌లో నాలుగో సీడ్ జొకో.. 3-6, 6-3, 4-6, 6-4, 6-4తో రెండో సీడ్ యానిక్ సిన్నర్ (ఇటలీ)కు షాకిచ్చాడు. ఈ మ్యాచ్ కూడా 4 గంటల 9 నిమిషాల పాటు సాగగా ఐదు సెట్ల థ్రిల్లర్‌లో డిఫెండింగ్ చాంపియన్‌పై సెర్బియా దిగ్గజానిదే పైచేయి అయింది. జొకోకు ఇది 11వ ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్ కాగా.. అతడు ఫైనల్ చేరిన



ప్రతిసారీ విజేతగానే నిలవడం గమనార్హం. ఈ నేపథ్యంలో జొకో, అల్కరాజ్ మధ్య ఆదివారం టైటిల్ పోరు రసవత్తర పోరు సాగనుండటం ఖాయం. అల్కరాజ్, జ్వెరెవ్ మధ్య మారథాన్‌గా సాగిన తొలి సెమీస్ అభిమానులకు పైసా వసూల్ వినోదాన్ని, అంతకుమించిన ఉత్కంఠనూ అందించింది. పట్టు వదలని ఆటతో ఇరువురూ కోర్టులో నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. మొదటి రెండు సెట్‌లనూ గెలుచుకున్న అల్కరాజ్.. ఫైనల్‌కు ఒకే ఒక సెట్ విజయం దూరంలో నిలువగా అనూహ్యంగా జ్వెరెవ్ పుంజుకున్నాడు. అదే సమయంలో మూడో సెట్‌లో స్కోరు 5-4 వద్ద ఉండగా అల్కరాజ్ కుడి కాలు పట్టేయడంతో కోర్టులో అతడు నొప్పితో ఇబ్బందిపడ్డాడు. మెడికల్ టైమౌట్ తీసుకుని సెట్‌ను టైబ్రేకర్‌కు తీసుకెళ్లినా జ్వెరెవ్‌దే పైచేయి అయింది. మూడో సెట్ విజయంతో లయ అందుకున్న జ్వెరెవ్ నాలుగో సెట్‌నూ అదే ఊపులో సొంతం చేసుకోవడంతో మ్యాచ్ కాస్తా నిర్ణయాత్మక ఐదో సెట్‌కు దారితీసింది. ఆఖరి సెట్‌లో అల్కరాజ్ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగి 2-0 ఆధిక్యాన్ని సాధించాడు. ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా ఒత్తిడి పెంచుతూ డ్రాప్ షాట్స్‌తో అతడిని బోల్తా కొట్టించాడు.



## ఎన్సీపీలో ఏం జరుగుతోందో నాకు తెలియదు

### శరద్ పవార్

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారనే వార్తలపై శరద్ పవార్ స్పందించారు. ఈ విషయం తనకు తెలియదని, తనతో ఎవరూ చర్చించలేదని వివరించారు. ఈ రోజు ఉదయం న్యూస్ పేపర్ల ద్వారా అజిత్ పవార్ కూటమి సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారనే విషయం మాత్రమే తనకు తెలిసిందన్నారు. ఆ పార్టీ తరఫున సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే ప్రభుత్వంతో చర్చలు జరిపినట్లు తెలిసిందన్నారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరాలని సునేత్రా పవార్ నిర్ణయించుకున్నట్లు తమ కుటుంబానికి తెలియదని శరద్ పవార్ పేర్కొన్నారు.

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు?: అంబటి రాంబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్ నివేదిక వచ్చిన తర్వాత వీరిద్దరూ నోరు మెదపడం లేదని అన్నారు. ఇంతవరకు పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన చంద్రబాబు, పవన్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎంతో పవిత్రమైన లడ్డూ ప్రసాదంపై విషం చిమ్మిన దుర్మార్గులు చంద్రబాబు, పవన్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరించారని అన్నారు. చంద్రబాబుకు పవన్ చెంచాగా మారిపోయారని, తనకు ఒక సొంత పార్టీ ఉందనే విషయాన్ని కూడా మరిచిపోయారని అంబటి ఎద్దేవా చేశారు. లడ్డూలో



జంతువుల కొవ్వు కలిసిందని, అయోధ్యకు పంపిన లడ్డూలో కూడా జంతువుల కొవ్వు ఉందని పవన్ తప్పుడు ప్రచారం చేశారని, భక్తుల మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు.

## మేడారంలో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్..

# గంటల తరబడి నిరీక్షణ

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర జనసంద్రంగా మారింది. లక్షలాది మంది భక్తులు గద్దెలపై కొలువైన వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం నిండు జాతర కావడంతో భక్తుల రద్దీ తారాస్థాయికి చేరింది. అయితే, ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ఏర్పాట్లు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొనడంతో భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా భారీ ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన అనుభవిస్తున్నారు. దర్శనం ముగించుకుని తిరుగుపయనమైన భక్తుల వాహనాలతో మేడారం మార్గాలు నిండిపోయాయి. తాడ్వాయి — మేడారం మార్గంలో ఆర్టీసీ బస్సులు, వీఐపీ వాహనాలతో పాటు ప్రైవేట్ వాహనాలు భారీగా చేరడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. 14 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సుమారు 3 గంటల సమయం పట్టిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గోవిందరావుపేట మండలం పస్రా వద్ద కూడా రెండు కిలోమీటర్ల



మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ప్రైవేట్ వాహనాలను పస్రా మీదుగా, ఆర్టీసీ, వీఐపీ వాహనాలను తాడ్వాయి మీదుగా మళ్లించారు. మరోవైపు అమ్మవార్ల గద్దెల వద్ద కూడా సరైన ఏర్పాట్లు లేవని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియక వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన వీఐపీ పాస్‌లు ఉన్నవారికి సైతం శుక్రవారం క్యూలైన్లను ఎత్తివేయడంతో గందరగోళం నెలకొంది. దీంతో పాస్‌లు చేతిలో ఉన్నా దర్శనం చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. విపరీతమైన రద్దీ, గంటల తరబడి నిరీక్షణతో విసిగిపోయిన కొందరు భక్తులు, అమ్మవార్లను దూరం నుంచే దణ్ణం పెట్టుకుని వెనుదిరిగారు. గురువారం రాత్రి సమ్మక్క తల్లి గద్దెపైకి చేరిన తర్వాత భక్తుల రాక ఒక్కసారిగా పెరగడంతో పోలీసులు సైతం చేతులెత్తేశారు. కాగా, శనివారం అమ్మవార్ల వన ప్రవేశంతో మహా జాతర ముగియనుంది.

# నటుడు జయరామ్‌కు సిట్ నోటీసులు


శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన బంగారం దోపిడీ కేసు రోజు రోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసులో తాజాగా పలువురు సెలబ్రిటీలు కూడా ఉన్నారన్న అనుమానాలు బలపడటంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను మరింత విస్తరించింది. ఈ క్రమంలో ప్రముఖ నటుడు జయరామ్ పేరు వెలుగులోకి రావడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ కేసులో భాగంగా శుక్రవారం సిట్ అధికారులు చెన్నైలోని నటుడు జయరామ్ నివాసానికి వెళ్లి ఆయన నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఆలయానికి సంబంధించిన కొన్ని ఆచారాలు, పూజలపై గతంలో మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. జయరామ్ ఇంట్లో జరిగిన ఒక ఆధ్యాత్మిక పూజలో బంగారం పూత ఉన్న రాగి పలకలు ఉపయోగించారన్న వార్తలు అప్పట్లో వైరల్‌గా మారాయి. ఆ అంశాలపై స్పష్టత కోసమే అధికారులు ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఉన్ని కృష్ణన్ పొట్టితో జయరామ్‌కు ఉన్న పరిచయం కూడా విచారణలో



కీలకంగా మారింది. వీరిద్దరూ కలిసి ఎప్పుడు, ఎక్కడ పూజలు నిర్వహించారు ? ఆ కార్యక్రమాల్లో ఉపయోగించిన వస్తువులు ఏవి ? వాటికి సంబంధించిన లావాదేవీలు ఏవైనా జరిగాయా ? అనే అంశాలపై సిట్ అధికారులు లోతుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆలయానికి సంబంధించిన పూజా వస్తువులు ప్రైవేట్ కార్యక్రమాల్లో ఉపయోగించారా ? అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## రాజ్యసభకు అజిత్ పవార్ కుమారుడు?

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణంతో ఆయన భార్య సునేత్ర పవార్ ఆ పదవిని చేపట్టే అవకాశాలున్నాయని, దీంతో ఆమె ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ స్థానం ఖాళీ అవుతుందని, ఆ స్థానానికి కుమారుడు పార్థ్ పవార్‌ను పంపించే అవకాశం ఉందని ఎన్సీపీ వర్గాల సమాచారం. ఈ పరిణామాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ప్రస్తుతం ఎంపీగా ఉన్న ఆయన తల్లి సునేత్రా పవర్  ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వర్గాలు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ స్థానాన్ని పార్థ్ భర్తీ చేయనున్నట్లు ఎన్సీపీ వర్గాలు తెలిపాయి. పార్థ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో మావల్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. అయితే, ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఇదిలాఉండగా.. ముంబయిలో నేడు పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం కానుందని పార్టీ నేత ఒకరు తెలిపారు. ఇందులో సునేత్రను శాసనసభాపక్ష నాయకురాలిగా ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. ఈ రోజు సాయంత్రం కల్లా ఆమె ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం కూడా చేస్తారన్నారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# డగ్ బర్గమ్ నియామకంపై ట్రంప్ వింత వ్యాఖ్యలు



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. తన కేబినెట్‌లో కీలకమైన ఇంటీరియర్ సెక్రటరీ పదవికి డగ్ బర్గమ్‌ను ఎంపిక చేయడం వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించి అందరినీ ఆశ్చర్య పరిచారు. ముఖ్యంగా బర్గమ్ భార్య క్యాథరిన్ చాలా అందంగా ఉండటం వల్లే ఆయనకు ఈ పదవి దక్కిందంటూ ట్రంప్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారాయి.

ఓవల్ ఆఫీసులో అనూహ్య వ్యాఖ్యలు..

మాదకద్రవ్యాల కట్టడికి సంబంధించిన ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన అనంతరం.. ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో డగ్ బర్గమ్, ఆయన భార్య క్యాథరిన్ కూడా అక్కడే ఉండటం గమనార్హం. "ఒకసారి డగ్, క్యాథరిన్ ఇద్దరూ గుర్రపు స్వారీ చేస్తున్న వీడియోను చూశాను. అందులో క్యాథరిన్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఆమె ఎవరని నా సిబ్బందిని ఆరా తీశాను. ఆ జంట గురించి తెలుసుకున్న తర్వాతే డగ్‌కు పదవి ఇవ్వాలని నిర్ణయించుకున్నాను" అని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు.

ప్రతిభ కంటే 'లుక్స్'కే ప్రాధాన్యతనా?

డగ్ బర్గమ్ ఒక విజయవంతమైన వ్యాపారవేత్త మాత్రమే కాకుండా నార్త్ డకోటాకు రెండు సార్లు గవర్నర్‌గా పని చేసిన అనుభవం ఉన్న వ్యక్తి. అయితే ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పక్కన పెట్టి.. కేవలం ఆయన భార్య అందాన్ని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "డగ్ విజయం వెనుక ఆయన భార్య పాత్ర కచ్చితంగా ఉండి ఉంటుంది. వీరు నిజంగా అద్భుతమైన జంట" అంటూ ట్రంప్ సమర్థించుకునే ప్రయత్నం చేసినప్పటికీ.. నియామకం వెనుక ఉన్న కారణం మాత్రం విడ్డూరంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.ట్రంప్ వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఒక కీలక ప్రభుత్వ పదవిని కేటాయించేటప్పుడు అభ్యర్థి సామర్థ్యాన్ని కాకుండా వారి కుటుంబ సభ్యుల రూపురేఖలను లెక్కలోకి తీసుకోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. గతంలోనూ ట్రంప్ మహిళల విషయంలో పలుమార్లు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి విమర్శల పాలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు అధికారిక వేదికపైనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అమెరికా రాజకీయాల్లో మళ్లీ సంచలనం సృష్టిస్తోంది.



## బడ్జెట్ తర్వాత విద్యార్థులతో నిర్మలా సీతారామన్ ముఖాముఖి

కేంద్ర బడ్జెట్ 2026-27 సమర్పణ అనంతరం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులతో సంభాషించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు లోక్‌సభ గ్యాలరీ నుండి బడ్జెట్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. కర్తవ్య భవన్-1లోని ఆర్థిక మంత్రిత్వ శాఖను సందర్శించి, సీనియర్ అధికారులతో చర్చలు జరపనున్నారు. సాయంత్రం, మంత్రి విద్యార్థులతో బడ్జెట్ ప్రాధాన్యతలు, దేశ భవిష్యత్తు, యువతపై దాని ప్రభావం గురించి చర్చిస్తారు. యువతలో ఆర్థిక, పాలనాపరమైన అవగాహన పెంపు, పార్లమెంటరీ విధానాలలో వారి భాగస్వామ్యం ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.



## అమెరికా నుంచి ఇజ్రాయెల్‌కు భారీ ఆయుధాలు

అమెరికా తన మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.36 వేల కోట్లు) విలువైన 30 అత్యాధునిక అపాచీ హెలికాప్టర్లను అందించే ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఈ భారీ ఆయుధ ప్యాకేజీలో భాగంగా 1.8 బిలియన్ డాలర్ల విలువైన 'జాయింట్ లైట్ టాక్టికల్ వెహికల్స్' కూడా ఉన్నాయి. గాజాలో కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో, ఇజ్రాయెల్ తన ఆత్మరక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది.



## ఏపీలో అమృత్ భారత్ రైళ్లు: కొత్త టైమింగ్స్ ఎప్పుడు ప్రారంభం?

దక్షిణ రైల్వే పరిధిలో ఇటీవల ప్రారంభమైన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల టైమింగ్స్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి.ప్రధాని మోడీ ప్రారంభించిన ఈ మూడు అమృత్ భారత్ రైళ్లతో పాటు మరో రైలు కూడా కొన్ని స్టేషన్లలో సమయాల్లో సవరణ పొందింది. దక్షిణ రైల్వే అధికారులు ఈ మార్పులను అధికారికంగా ప్రకటించి, ఏరువారీ నుంచి కొత్త టైమింగ్స్ అమల్లోకి వస్తాయో కూడా వెల్లడించారు.నాలుగు అమృత్ భారత్ రైళ్లలో మార్పులు

★దక్షిణ రైల్వే ప్రాంతంలోని ఎంపిక చేసిన స్టేషన్లలో ఈ నాలుగు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను సవరించారు:

రైలు నం.16108: సత్రగచ్చి — తాంబరం అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

రైలు నం.20610: తిరుచ్చిరాపల్లి — న్యూ జల్పైగురి అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

రైలు నం.20604: న్యూ జల్పైగురి — అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

రైలు నం.16121: తాంబరం — తిరువనంతపురం అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

ప్రయాణికులు తమ ప్లాన్ ప్రకారం కొత్త సమయాలను గమనించుకోవడం అవసరం అని అధికారులు సూచించారు.

ఏపీలో టైమింగ్స్ మార్పులు

-రైలు నం.16108 (సత్రగచ్చి — తాంబరం):శ్రీకాకుళం రోడ్ నుంచి నెల్లూరు స్టేషన్ వరకూ స్వల్ప మార్పులు. తాంబరానికి రాకుయే సమయం 10 నిమిషాలు ముందుగా, ఉదయం 9:05 గా సవరించబడింది. ఫిబ్రవరి 7 నుంచి కొత్త టైమింగ్స్ అమల్లోకి వస్తాయి.

-రైలు నం.20610 (తిరుచ్చిరాపల్లి — న్యూ జల్పైగురి):ఏపీలోని దువ్వాడ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్లలో టైమింగ్స్ స్వల్పంగా మార్చబడ్డాయి. ఈ మార్పులు ఫిబ్రవరి 4 నుంచి అమల్లోకి వస్తాయి.

-రైలు నం.20604 (న్యూ జల్పైగురి — అమృత్ భారత్):ఏపీలోని దువ్వాడ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్లలో సమయాలను స్వల్పంగా సవరించారు. ఫిబ్రవరి 1 నుంచి కొత్త టైమింగ్స్ అమల్లోకి వచ్చాయి.

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై పెంపుడు కుక్క దాడి.. 50 కుట్లు!

31 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మెడ, ముఖం, కాళ్లపై తీవ్ర గాయాలు

ఏ కారణం లేకుండానే ఒక్కసారిగా మీదపడి మెడను కొరికిన కుక్క



గణతంత్ర దినోత్సవం రోజున బెంగళూరులో తెల్లవారుజామున 6:54 గంటల సమయంలో ఒక మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన నివాసం వద్ద మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. అంతా ప్రశాంతంగా ఉందనుకుంటున్న సమయంలో, ఒక్కసారిగా ఓ పెంపుడు కుక్క ఆమెపైకి దూసుకొచ్చింది. నేరుగా మెడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆమె అరుపులు విని ఒక వ్యక్తి వెంటనే స్పందించి కుక్కను లాగేందుకు ప్రయత్నించాడు. అయితే, అది అతడిపైనా దాడికి దిగింది. అత్యంత కష్టం మీద ఆ వ్యక్తి కుక్క మెడను గట్టిగా పట్టుకొని పక్కకు లాగడంతో, బాధితురాలు ప్రాణభయంతో తడబడుతూనే లేచి లోపలికి వెళ్లి గేటు వేసుకోగలిగింది. ఈ దాడిలో బాధితురాలి ముఖం, చేతులు, కాళ్లపై లోతైన గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆమెకు 50కి పైగా కుట్లు వేశారు. పెంపుడు కుక్కను సరిగ్గా కట్టడి చేయకుండా వదిలేసిన యజమాని నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన సీసీటీవీ విజువల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ స్పందించింది. ఆ కుక్కకు లైసెన్స్ ఉందో లేదో తనిఖీ చేస్తోంది. బాధ్యుడైన యజమానిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.




## టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్ స్టేజ్‌కు మ్యాచ్ అఫీషియల్స్ ప్రకటన

ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభం కానున్న పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌ల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి శుక్రవారం మ్యాచ్ అఫీషియల్స్ జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో మొత్తం 24 మంది ఆన్-ఫీల్డ్ అంపైర్లు, ఆరుగురు మ్యాచ్ రిఫరీలు ఉన్నారు. సూపర్-8, నాకౌట్ దశలకు సంబంధించిన అఫీషియల్స్ వివరాలను ఐసీసీ తర్వాత వెల్లడించనుంది. కొలంబోలో పాకిస్థాన్, నెదర్లాండ్స్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌కు కుమార ధర్మసేన, వేన్ నైట్స్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. ఈ మ్యాచ్‌తో నైట్స్ టీ20 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయనున్నాడు. ఇదే మ్యాచ్‌లో నైట్స్ తన 50వ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌కు అంపైర్‌గా నిలవడం విశేషం. ధర్మసేన గతంలో 2016, 2022 ఫైనల్స్‌తో సహా అనేక కీలక మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశాడు.అందరూ ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఈ హై-వోల్టేజ్ పోరుకు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, కుమార్ ధర్మసేన అంపైర్లుగా వ్యవహరిస్తారు. ఇక ఫిబ్రవరి 7న ముంబైలో అమెరికాతో జరిగే మ్యాచ్‌కు పాల్ రీఫిల్, రాడ్ టక్కర్ అంపైర్లుగా ఉంటారు. భారత్‌కు చెందిన నితిన్ మీనన్ అంపైర్ల జాబితాలో చోటు దక్కించుకోగా, మాజీ పేసర్ జవగళ్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా ఎంపికయ్యాడు.

## క్రమ మట్టి తవ్వకాలు కలకలం




రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లి గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు కలకలం రేపాయి. చెరువులో అనుమతి లేకుండా మట్టి తవ్వుతున్నారని గ్రామ ఉపసర్పంచ్ మందాటి బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పట్టా భూమిలో అనుమతి ఇచ్చామని, చెరువులో తవ్వకాలు జరుగుతున్నాయని తమ దృష్టికి రావడంతో పనులు నిలిపివేయాలని ఆదేశించినట్లు తహశీల్దార్ సుజాత తెలిపారు. తదుపరి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



## ఫ్లోరిడాలో తీవ్ర చలి.. వాయిదాపడ్డ నాసా చంద్రుడి యాత్ర

చంద్రుడిపైకి మనిషిని పంపే ప్రయోగాల్లో కీలకమైన 'ఆర్టెమిస్-2' యాత్ర వాయిదా పడింది. ఫ్లోరిడాలో నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ప్రయోగాన్ని ఫిబ్రవరి 8వ తేదీకి మార్చినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) ప్రకటించింది. తొలుత ఈ ప్రయోగాన్ని ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫిబ్రవరి 6న చేపట్టాలని నిర్ణయించారు. ఫ్లోరిడా రాష్ట్రంలో తీవ్రమైన చలిగాలులు, గాలుల వేగం ఎక్కువగా ఉండటంతో నాసా ఈ నిర్ణయం తీసుకుంది. "వాతావరణ పరిస్థితుల కారణంగా ఆర్టెమిస్-2 రాకెట్‌లో ఇంధనాన్ని నింపే ప్రక్రియను ఫిబ్రవరి 2వ తేదీ సోమవారం నాడు చేపట్టాలని ప్లాన్ చేస్తున్నాం. ఈ మార్పుతో ప్రయోగానికి సాధ్యమయ్యే తొలి తేదీ ఫిబ్రవరి 8 అవుతుంది. ఇంధనం నింపే ప్రక్రియను సమీక్షించాక తుది ప్రయోగ తేదీని ఖరారు చేస్తాం" అని నాసా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో తెలిపింది. ఆర్టెమిస్-2 యాత్రలో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి వస్తారు. వ్యోమగాముల బృందం ప్రస్తుతం హ్యూస్టన్‌లో క్వారంటైన్‌లో ఉంది. మరోవైపు ఇంజనీర్లు ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను పవర్ ఆన్‌లో ఉంచి, చల్లని ఉష్ణోగ్రతల నుంచి రక్షణకు హీటర్లను కాన్ఫిగర్ చేశారు. 10 రోజుల పాటు సాగే ఈ యాత్ర, 2027లో చేపట్టనున్న ఆర్టెమిస్-3 మిషన్‌కు మార్గం సుగమం చేస్తుంది. ఆర్టెమిస్-3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై తొలిసారిగా మనిషి అడుగుపెట్టనున్నాడు. దాదాపు 50 ఏళ్ల క్రితం 1972లో అపోలో-17 మిషన్ తర్వాత మానవులతో చేపడుతున్న చంద్రుడి యాత్ర ఇదే కావడం విశేషం. ఈ బృందంలో కమాండర్ రీడ్ వైస్‌మన్, పైలట్ విక్టర్ గ్లోవర్, మిషన్ స్పెషలిస్టులు క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్ ఉన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌కు రెండోసారి సిట్ నోటీసు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని 160 సీఆర్‌పీసీ కింద ఈ నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలోనే విచారణ జరపనున్నట్లు సిట్ స్పష్టం చేసింది.ఇటీవల గురువారం సిట్ తొలిసారి నోటీసులు జారీ చేయగా, మున్సిపల్ ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఖరారు అంశంలో బిజీగా ఉన్నందున మరో తేదీ కేటాయించాలని కేసీఆర్ కోరారు. ఇందుకు సిట్ అంగీకరించింది. అయితే తనను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లోనే విచారించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని మాత్రం సిట్ అధికారులు తిరస్కరించారు. న్యాయ నిపుణుల సలహా మేరకు నందినగర్‌లోని అధికారిక నివాసంలోనే విచారణ జరపాలని నిర్ణయించిశుక్రవారం రెండోసారి నోటీసులు అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులుప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులతో పాటు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ రావులను సిట్ విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసింది.ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, నమోదు చేసిన వాంగ్మూలాల ఆధారంగా ఈ కేసులో కేసీఆర్‌ను విచారించడం కీలకమని సిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న విచారణ తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.